క్లుప్తంగా

దళితరత్న అవార్డు గ్రహీత 'కోర్నెల్' కు సన్మానం



ఆత్మకూరు : ఇటీవల దళిత రత్న అవార్డు అందుకున్న మాజీ ఎంపీటీసీ నత్ని కోర్నెల్‌ను గురువారం మండల కేంద్రంలో పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరీటి మాట్లాడుతూ.. కోర్నెల్ చేసిన సేవలకు గుర్తింపుగా దళితరత్న అవార్డు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు సంగె మహేందర్, బరుపట్ల రమేశ్, సారంగపాణి, అయోధ్య, చందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

శాయంపేట : మాజీ ఎంపీటీసీ దైనంపల్లి జమునసుమన్ సోదరుడు, బీఆర్‌ఎస్ కార్యకర్త మారేపల్లి నాగరాజు ఇటీవల ప్రమాదవశాత్తు గోడ కూలి మీదపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు గాదె రాజేందర్, గడిపే విజయ్, మోహన్, రమేశ్, కరుణాకర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరకాలలో..



పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన ప్రముఖ రైస్‌మిల్ వ్యాపారి రామిని శ్రీశైలం కుటుంబాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం పరామర్శించారు. శ్రీశైలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీశైలం మృతి గురించి ఆయన కుమారులు శ్రవన్‌కుమార్, శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మాజీ కౌన్సిలర్ పారండ్ల సంతోశ్, వ్యాపారి చిటికేసి కృష్ణమూర్తి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మెరుగైన ఫలితాలు

పర్వతగిరి : ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ కార్యవర్గం సమష్టి కృషి ఫలితంగానే పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని మండల కేంద్రంలోని పీఎం శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల స్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. పదో తరగతిలో 567 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన కె.ఝాన్సీని పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ స్కూల్ ఆవరణలో గురువారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన పోశాల కీర్తన (558), అంగోతు మానస (555), సౌమ్యశ్రీ (542), టిడ్డీ పల్లవి (542), గడ్డం నిత్యశ్రీ (524)లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న, స్వాతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇల్లందుల రాణి, వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, సభ్యులు మాంకాల యాదగిరి, ఉపేందర్, మేకరి మల్లికార్జున్, పసునూరి భాస్కర్, బిర్రు కరుణాకర్, గోగుల లావణ్య, బలపాక స్వప్న, ముజ్జిగా అనిల్, పానుగంటి స్వామి, యాకూబ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నయీంనగర్ : పరకాల శ్రీ చైతన్య మోడ్రన్ స్కూల్‌కు చెందిన 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 25 వసంతాల(రజతోత్సవ) అపూర్వ సమ్మేళనం గురువారం హనుమకొండలోని ఓ బాంకెట్ హాల్లో నిర్వహించారు. 60 మంది పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు ఎడ్ల సుధాకర్, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, ధరనేశ్వర్, శర్మ, కుమారస్వామి, ఉమను శాలువా, బొకేలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

గీసుకొండ : బీసీ జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సమాజ్ (టీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆత్మగౌరవ పాదయాత్ర మండలంలోని పోతరాజుపల్లి, గొర్రెకుంట మీదుగా గురువారం సాగింది.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల పాట్లు



బస్సు కోసం రోడ్డుపై వేచిచూస్తున్న మహిళలు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బెంచీలు

- నిలువ నీడ లేదు, కూర్చునే పరిస్థితిలేదు
- రోడ్లపైనే పడిగాపులు
- మహిళలకు తప్పని ఇబ్బందులు

దామెర : పేరుకు మాత్రమే మండల కేంద్రం.. కానీ బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దామెరను మండల కేంద్రంగా ఏర్పాటుచేసి 9 సంవత్సరాలు పూర్తికావస్తోంది. కానీ బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలువ నీడ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మండలంలోని ల్యాదెళ్ల, వెంకటాపూర్, పులుకుర్తి, సింగరాజుపల్లి, కోగిల్వాయితో పాటు పలు గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి ప్రతిరోజు వస్తుంటారు. అంతే కాకుండా గ్రామం నుంచి ప్రతి రోజు వందల సంఖ్యలో హనుమకొండ, వరంగల్, పరకాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. నగరంలోని పలు కళాశాలలకు గ్రామం నుంచి ఎంతో మంది విద్యార్థులు వెళ్లివస్తుంటారు. కాగా బస్ షెల్టర్ లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలపై బస్ కోసం వేచి చూస్తున్నారు. ఆర్టీసీ సంస్థ ఆదాయంపై ఉన్న దృష్టి ప్రయాణికుల సమస్యలను పట్టించుకోవడంపై లేదనే విమర్శలు వస్తున్నాయి.

దుకాణాలే దిక్కు

వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు, ప్రైవేటు వాహనాల కోసం ప్రతిరోజు ఎదురు చూస్తుంటారు. కాగా బస్ షెల్టర్‌లేని కారణంగా రోడ్డు పైనే వేచిచూడాల్సి వస్తోంది. ఎండకు ఎండుతూ, వర్షానికి తడవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో కూడలిలోని దుకాణాలు, చికెన్ సెంటర్లు, హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అంతే కాకుండా మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు అవస్థలు పడుతున్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి



మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేని కారణంగా ప్రతిరోజు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండుతున్న ఎండల్లో ప్రయాణికులు బస్సుకోసం ఎదురు చూడాల్సి వస్తోంది. చుట్టుపక్కల ఉన్న దుకాణాల్లో వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు అన్ని వసతులతో కూడిన బస్ షెల్టర్‌ను నిర్మించాలి.

- వేల్పుల రాజ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

- ఏపీడీ శ్రీనివాస్‌రావు



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీనివాస్‌రావు

నడికూడ : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కంఠాత్మకూరు, కౌకొండ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల నర్సరీలను పరిశీలించి సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల కూలీలకు వందల సంఖ్యలో జాబ్ కార్డులున్నా తక్కువ సంఖ్యలోనే కూలీకి వస్తున్నారని, ఎక్కువ సంఖ్యలో పనులకు వచ్చేలా చూడాలని అన్నారు. పని ప్రదేశంలో మంచినీటి వసతి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విమల, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



దామెర : తల్లిదండ్రులు మందలించారని యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుమా నవీన్ (23) బొలేరో వాహనం నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా గత నెలలో రెండు రోజులపాటు కిరాయికి వెళ్లి 26న ఇంటికి తిరిగి వచ్చాడు. దీంతో రెండు రోజులుగా కనీసం ఫోన్ చేయలేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నవీన్ 27వ తేదీన ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నవీన్ తండ్రి సాంబమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిప్పంటుకుని మొక్కజొన్న దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న చేను చూపిస్తున్న బాధితులు

దామెర : నిప్పంటుకుని మొక్కజొన్న చేను దగ్ధమైన సంఘటన మండలంలోని తక్కళ్లపహాడ్‌లో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో దాడి భిక్షపతి, రవి 3 ఎకరాల్లో మొక్కజొన్న చేను సాగుచేశారు. కాగా చేను ఎండిపోయి ఇటీవల వచ్చిన ఈదురు గాలికి నేలకొరింగింది. దీంతో రైతులు మొక్క జొన్న కంకులను చేను నుంచి వేరుచేసి బస్తాల్లో నింపి అక్కడే నిల్వ ఉంచారు. కాగా గురువారం ఉదయం రైతులు వెళ్లి చూసేసరికి మంటలు అంటుకుని కాలిపోయినట్లు తెలిపారు. అదే విధంగా కరెంటు మోటర్ వైరు, పైపులు కాలిపోయినట్లు రైతులు వాపోయారు. ఇద్దరు రైతులకు సుమారు 3 లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో కలిబూడిదైందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఏఎస్ఎం కాలేజీ, ఖిలావరంగల్ పెట్రోల్ పంపు, నానామియా తోట, తాళ్ల పద్మావతి కాలేజీ, దొడ్డి కొమురయ్య నగర్, తిమ్మాపూర్, అల్లీపూర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కార్మికులే సంపద సృష్టికర్తలు

కార్మికులే సంపద సృష్టికర్తలని పలువురు నాయకులు కొనియాడారు. గురువారం ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా సీపీఐ, ఐఎన్‌టీయూసీ, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ), తాపీమేస్త్రీ యూనియన్, డీబీఎఫ్, యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎర్రజెండాలు ఆవిష్కరించి 'కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి' అని నినాదాలు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



ఎల్కతుర్తి : జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్



ఎల్కతుర్తి : ముల్కనూరులో..



శాయంపేటలో..



శాయంపేట : శ్రీహరి స్థూపం వద్ద నివాళులర్పిస్తూ..



కమలాపూర్ : పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తూ..



కమలాపూర్ : జెండా ఆవిష్కరిస్తున్న రామ్మూర్తి



పరకాల : రౌతు మనోహర్ స్థూపం వద్ద..



పరకాల : వ్యవసాయ మార్కెట్ ఆవరణలో..



ఐనవోలులో..



దామెర : మేడే సందర్భంగా ఒగ్లాపూర్‌లో కూలీలకు కార్మికుల హక్కులపై అవగాహన కల్పిస్తున్న చుంచు రాజేందర్



ఆత్మకూరు : జీపీ కార్మికులతో యూత్ కాంగ్రెస్ నాయకులు



నడికూడ : జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



కమలాపూర్ : మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్



పరకాల : మాట్లాడుతున్న ఎంఈఓ రమాదేవి

కమలాపూర్ : విద్యార్థులు వేసవి శిబిరాలను వినియోగించుకుని తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఎంఈఓ కె.శ్రీధర్ సూచించారు. మండలంలోని ఉప్పల్ బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 15వ తేదీ వరకు నిర్వహించే ఈ వేసవి శిబిరంలో కమ్యూనికేషన్ స్కిల్స్, కాలీగ్రఫీ, ఇండోర్ గేమ్స్, బేసిక్ మ్యాథ్స్, మోరల్ ఎడ్యుకేషన్, ఆర్ట్స్, క్రాఫ్ట్ తదితర అంశాల్లో నిపుణులు మెలకువలు నేర్పిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు వాణి, నిర్మల, ఏఏపీసీ సభ్యురాలు రాణి, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఎర్రబెల్లి సంపత్‌రావు, ర్యాకం శ్రీనివాస్, నద్దునూరి ప్రసాద్, సత్యపాల్, రాణాప్రతాప్, సీఆర్పీలు సుభాశ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల : మే 1 నుంచి ప్రారంభమైన ఉచిత వేసవి వినో శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సి.హెచ్ రమాదేవి కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వేసవిలో పిల్లలు సెల్‌ఫోన్‌లకు మరింత బానిసయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మూడో తరగతి వయస్సు చిన్నారుల నుంచి పదో తరగతి చదువుకునే పిల్లల వరకు వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మధు, ఎంపీపీఎస్ హెచ్ఎం రాజయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీశివ మార్కండేయ స్వామి ఆలయంలో శ్రీద్వాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం రెండోరోజు కొనసాగాయి. భద్రకాళి దేవస్థానం అర్చకుడు గణేశ్ ఆత్రేయ శర్మ, దుర్గాసాయి శర్మ, ప్రద్యుమ్న శర్మ, అచ్యుత్ శర్మ, సాయి ప్రణీత్ శర్మ, సాయి రాజేశ్ శర్మ, దుర్గా ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణం, అగ్ని స్థాపన, బేరీతాడనం, ధ్వజారోహణం, మండల దేవతపూజానం, ఎదుర్కోలు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్‌పద్మజ, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, బాసాని విశ్వప్రకాశ్ శోభ, జయప్రకాశ్, ఆలయ అర్చకులు రాజ్‌కుమార్, రమేశ్, కర్ణాకర్, భక్తులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చిన 'భగీరథ' అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా మిషన్ భగీరథ మేయిన్ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేసి గుంతను పూడ్చకుండా వదిలేసిన విషయం తెలిసిందే. కాగా గురువారం సాక్షి దినపత్రికలో 'తవ్వారు.. వదిలేశారు' అనే కథనం ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ శ్రీనివాస్ కాంట్రాక్టర్‌తో గుంతను పూడ్చివేయించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన సాక్షికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



గుంత పూడ్చివేసిన అధికారులు

చలివేంద్రంలోని రంజన్లు మాయం



చలివేంద్రంలో కనిపించని రంజన్‌లు

కమలాపూర్ : వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంలోని రంజన్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని కానిపర్తిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కానిపర్తి బస్టాండ్ వద్ద స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల చలివేంద్రం ఏర్పాటు చేశారు. అయితే అందులోని రంజన్లు మాయమయ్యాయి. కేవలం స్నేహ సేవా ఫౌండేషన్‌పై ఉన్న ఈర్ష్య, ద్వేషం, స్నేహ సేవా ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు నచ్చని కొందరు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఇలాంటి చర్యలు హేయమని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

కక్కిరాలపల్లిలో కొండచిలువ కలకలం

- ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చిన స్థానిక పోలీసులు



ఉచ్చులో చిక్కుకున్న కొండచిలువ

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామ సమీపంలోని గుట్టపై గురువారం కొండచిలువ కలకలం రేపింది. గ్రామస్తులు, ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కక్కిరాలపల్లి శివారు వడ్డెర, కాశగూడెం సమీపంలో ఉన్న గుట్టకిరువైపులా పనికోసం వెళ్లిన వారికి గురుకలాంటి శబ్దం వినిపించింది. కాగా వారు పరిశీలించేందుకు గుట్టపైకి వెళ్లారు. అక్కడ బండ సొరకలో ఉచ్చులో చిక్కుకుని కొండచిలువ కనిపించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై అక్కడకు చేరుకుని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. కాసేపటికి కాకతీయ జువాలాజికల్ పార్క్ నుంచి రెస్క్యూ టీం సిబ్బంది మంద శంకర్, కప్పల కృష్ణ, స్వామి అక్కడికి చేరుకున్నారు. కొండ చిలువను బయటకు తీసేందుకు శ్రమించారు. బయటకు తీయడం కష్టంగా మారడంతో ఉచ్చును తొలగించగా కొండచిలువ అదే సొరకలోకి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

సభ్యత్వ నమోదు

శాయంపేట : అఖిల భారత పద్మశాలి సంఘం అనుబంధమైన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదును గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ.. పద్మశాలీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెపల్లి సాంబయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి బాసాని బాలకృష్ణ, గ్రామ కోశాధికారి రమేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు ప్రమాణస్వీకారం

ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో నేడు పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సామల మధుసూదన్ ప్రమాణస్వీకారం ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బాసాని చంద్రప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల్లో పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాగ్రత్తలతో విద్యుత్ ప్రమాదాల నివారణ

దుగ్గొండి : సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించొచ్చని నర్సంపేట ట్రాన్స్‌కో డీఈ తిరుపతి తెలిపారు. తొగర్రాయిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. వినియోగదారులకు పలు అంశాలను వివరించారు.